# 10 జూన్ 2026: కేంద్ర మంత్రివర్గ తీర్మానం

**ప్రధానమంత్రిగా దేశానికి అత్యంత దీర్ఘకాలం నిరంతర సేవలందించిన గౌరవ ప్రధానమంత్రి చారిత్రాత్మక ఘట్టం.**

ఈ రోజు, 10 జూన్ 2026, భారత ప్రజాస్వామ్య ప్రయాణంలో ఒక చారిత్రాత్మకమైన, స్ఫూర్తిదాయకమైన మైలురాయిగా నిలిచింది. ఈ రోజు శ్రీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఎన్నికై దేశానికి అత్యంత దీర్ఘకాలం నిరంతర సేవలందించిన ప్రధానమంత్రిగా అవతరించారు. ప్రధానమంత్రిగా ఎన్నికై ఆయన 4,399 రోజుల నిరంతర సేవల రికార్డును నెలకొల్పారు. స్వతంత్ర భారత చరిత్రలో ఈ ఘనతను సాధించిన తొలి ప్రధానమంత్రి ఆయన. అంతకుముందు శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ గారు 1952 నుండి 1964 వరకు 4,398 రోజుల పాటు ఈ పదవిలో నిరంతరంగా కొనసాగారు.

ఈ సందర్భం భారత ప్రజాస్వామ్య చైతన్యం, ప్రజల విశ్వాసం, ప్రజా భాగస్వామ్య బలానికి ప్రతీక. ఒక ప్రజాప్రతినిధి 'దేశం ప్రథమం' అనే సంకల్పంతో జీవిస్తూ, సత్యం, నిజాయితీ, కృషి, నిబద్ధత, నైతికతను తన మార్గదర్శక సూత్రాలుగా చేసుకొని ప్రజాసేవకు అంకితమైతే, ప్రజలు అపూర్వమైన మద్దతు రూపంలో తమ ఆశీర్వాదాలను అందిస్తారు. నేటి ఈ చారిత్రాత్మక ఘట్టం అలాంటి ప్రజా ఆశీర్వాదానికి ప్రతిబింబం.

ఈ సందర్భంగా గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి కేంద్ర మంత్రివర్గం హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తోంది.

10 జూన్ 2026న నమోదైన ఈ చారిత్రాత్మక మైలురాయి మరెన్నో విశిష్ట విజయాలతో కూడి ఉంది. గౌరవనీయ ప్రధానమంత్రి నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ప్రభుత్వాధినేతగా ఆయన నిరంతర ప్రజాసేవలో 25 సంవత్సరాల చారిత్రాత్మక మైలురాయిని కూడా చేరువలో ఉన్నారు.

ఆరు దశాబ్దాల తరువాత, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి వరుసగా మూడోసారి ప్రజలు స్పష్టమైన ప్రజా తీర్పు ఇవ్వడం కూడా విశేషం. సున్నితత్వం, సంయమనం, స్పష్టమైన సంకల్పం, నిర్ణయాత్మక సామర్థ్యం కలిగిన నాయకత్వం దేశానికి లభించడం గర్వకారణం.

గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి జీవితం సేవ, ధైర్యం, దేశ నిర్మాణం కోసం నిరంతర కృషికి ప్రతీక. సంస్థాగత కార్యకర్తగా, అనంతరం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయనకు వచ్చిన అనుభవం ప్రభుత్వ విధానాలను మరింత సున్నితమైనవి, ఆచరణాత్మకమైనవి, ఫలితాలపై దృష్టి సారించినవిగా మార్చింది.

2014లో ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఆయన తనను తాను 'ప్రధాన సేవక్'గా పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పవిత్ర గ్రంథంగా అభివర్ణిస్తూ, తన ప్రభుత్వం పేదలకు అంకితమై ఉంటుందని తెలిపారు. 'సబ్‌కా సాథ్ – సబ్‌కా వికాస్' అనే మంత్రాన్ని ప్రభుత్వ ధ్యేయంగా స్వీకరించి గత 12 సంవత్సరాల పాలన సాగింది.

ప్రధానమంత్రి నాయకత్వంలో పేదల సంక్షేమం పరిపాలనకు కేంద్రబిందువుగా నిలిచింది. పక్కా ఇళ్లు, విద్యుత్, గ్యాస్ కనెక్షన్లు, స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కోట్లాది మందికి చేరాయి. కోట్లాది మందికి తొలిసారిగా బ్యాంకు ఖాతాలు తెరవబడటంతో ప్రభుత్వ సహాయం నేరుగా అందింది. 80 కోట్లకు పైగా పౌరులకు ఉచిత రేషన్, 60 కోట్లకు పైగా పేదలకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స హామీ లభించింది. ఈ చర్యలు ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ఫలితంగా 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు.

ప్రధానమంత్రి యువశక్తిని భారతదేశ అతి పెద్ద సంపదగా భావిస్తున్నారు. నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ ఇండియా, ఆవిష్కరణలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, క్రీడలు, వ్యవస్థాపకత, ఫిట్‌నెస్ రంగాలకు అపూర్వ ప్రోత్సాహం లభించింది. భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద అంకుర వ్యవస్థగా ఎదిగింది. చంద్రయాన్ మిషన్ ద్వారా చంద్రుడి దక్షిణ ధృవంపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి శాస్త్ర సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది.

ప్రధానమంత్రి స్ఫూర్తితో గత 12 సంవత్సరాల్లో భారత అభివృద్ధి ప్రస్థానంలో మహిళల నేతృత్వంలోని అభివృద్ధికి ఒక కొత్త అధ్యాయం జోడించబడింది. ఆయన మార్గదర్శకత్వంలో కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారతను తన విధానాల కేంద్రబిందువుగా మార్చి, మహిళల సంక్షేమం మరియు అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చింది.

ఇంటింటా మరుగుదొడ్ల నిర్మాణం, ఉజ్వల యోజన ద్వారా పొగరహిత వంటగదులు, గర్భిణీ స్త్రీలకు ఆర్థిక సహాయం, ముద్ర యోజన ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు, మహిళల పేరుతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహాల మంజూరు, లక్షపతి దీదీ అభియాన్ వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు జీవితంలోని ప్రతి దశలో అండగా నిలిచే సమగ్ర సహాయ వ్యవస్థను ప్రభుత్వం రూపొందించింది. అంతేకాకుండా, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా దేశ విధాన రూపకల్పనలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చారిత్రాత్మక అడుగు వేయబడింది. ఈ చర్యలు మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా, దేశ అభివృద్ధికి నాయకత్వం వహించే శక్తిగా తీర్చిదిద్దుతున్నాయి.

గౌరవనీయ ప్రధానమంత్రి కలలుగంటున్న 'వికసిత భారత్' నిర్మాణానికి రైతులు ప్రధాన ఆధార స్తంభాల్లో ఒకరు. గత 12 సంవత్సరాల్లో రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపట్టింది.

రైతులకు మెరుగైన విత్తనాల అందుబాటు, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ప్రత్యక్ష ఆర్థిక సహాయం, కనీస మద్దతు ధర (MSP) పెంపు, ప్రభుత్వ కొనుగోళ్ల విస్తరణ వంటి చర్యలు వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిచ్చాయి. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు, పశుపాలకులు, మత్స్యకారుల సంక్షేమానికి అపూర్వ ప్రాధాన్యత ఇవ్వబడింది. కిసాన్ క్రెడిట్ కార్డ్ (KCC) సదుపాయాన్ని పశుపాలకులు, మత్స్యకారులకు విస్తరించడం వల్ల లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారు.ఈ చర్యల ఫలితంగా భారత వ్యవసాయ రంగం మరింత బలోపేతమై, ప్రపంచ మార్కెట్లలో తన స్థానాన్ని విస్తరించుకుంది. 2014లో సుమారు రూ.2.6 లక్షల కోట్లుగా ఉన్న వ్యవసాయ ఎగుమతులు నేడు రూ.5 లక్షల కోట్లకు పైగా చేరుకోవడం రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి పట్ల గౌరవనీయ ప్రధానమంత్రి అవలంబిస్తున్న విధానాల సానుకూల ప్రభావానికి స్పష్టమైన నిదర్శనం.

'దేశమే ప్రథమం' అనే అచంచల సంకల్పంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎప్పుడూ కీలక నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకడుగు వేయలేదు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని అనేక జాతీయ అంశాలు, సంస్కరణలు ఆయన నాయకత్వంలో కార్యరూపం దాల్చాయి. జమ్మూ-కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, వస్తు-సేవల పన్ను (GST) అమలు, వన్ ర్యాంక్ వన్ పెన్షన్ (OROP) అమలు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (CDS) పదవి ఏర్పాటు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పన, శత్రు ఆస్తుల చట్టం అమలు, పౌరసత్వ సవరణ చట్టం (CAA) ప్రవేశపెట్టడం, ట్రిపుల్ తలాక్ నిర్మూలనకు చట్టబద్ధత కల్పించడం, వక్ఫ్ చట్ట సవరణలు, అణుశక్తి రంగ సంస్కరణలకు ఊతమిచ్చే చట్టపరమైన మార్పులు, భారతీయ న్యాయ సంహిత అమలు, అలాగే అనేక కార్మిక చట్టాలను నాలుగు సమగ్ర లేబర్ కోడ్‌లుగా ఏకీకృతం చేయడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు దేశ పాలనలో మైలురాళ్లుగా నిలిచాయి. ఈ చారిత్రాత్మక నిర్ణయాలు గౌరవనీయ ప్రధానమంత్రి నిర్ణయాత్మక నాయకత్వాన్ని మరింత బలపరిచాయి.

గౌరవనీయ ప్రధానమంత్రి నాయకత్వంలో దేశ జాతీయ భద్రతకు కొత్త దిశ, కొత్త బలం లభించాయి. ఉగ్రవాదంపై రాజీలేని వైఖరిని అవలంబిస్తూ, దేశ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వబడింది. ఆయన నాయకత్వంలోనే సరిహద్దులు దాటి ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించబడ్డాయి. అలాగే, సరిహద్దులు దాటి వైమానిక దాడులు చేపట్టడం ద్వారా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం తన దృఢసంకల్పాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' ద్వారా గతంలో ఊహించని లక్ష్యాలపై కూడా చర్యలు చేపట్టడం భారతదేశ భద్రతా విధానంలో వచ్చిన మార్పును ప్రతిబింబించింది. గౌరవనీయ ప్రధానమంత్రి ఆదేశాల మేరకు, దశాబ్దాల క్రితం పాకిస్థాన్‌తో కుదిరిన సింధు జలాల ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిన స్థితిలో ఉంచింది. దీంతో భారతదేశానికి చెందిన జల వనరులు దేశ రైతుల అభ్యున్నతికి, జాతీయ ప్రయోజనాలకు మరింత సమర్థవంతంగా ఉపయోగపడే మార్గం సుగమమైంది.

గౌరవనీయ ప్రధానమంత్రి నాయకత్వంలో భారతదేశం నక్సలిజం రహిత దేశంగా రూపుదిద్దుకుంటోంది. ఈశాన్య రాష్ట్రాల్లో అనేక చారిత్రాత్మక శాంతి ఒప్పందాలు కుదరడంతో అక్కడ అపూర్వమైన శాంతి, స్థిరత్వం నెలకొంది. అలాగే, దశాబ్దాలుగా కొనసాగిన భారత్–బంగ్లాదేశ్ సరిహద్దు వివాదానికి కూడా విజయవంతంగా పరిష్కారం లభించింది.

స్వావలంబన లేకుండా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారలేదని ప్రధానమంత్రి విశ్వసిస్తున్నారు. ఈ స్ఫూర్తితో మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలు వేగం అందుకున్నాయి. రక్షణ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, ఔషధ తయారీ, సెమీకండక్టర్లు, హరిత శక్తి, అంతరిక్ష సాంకేతికత, కృత్రిమ మేధస్సు రంగాల్లో భారత్ కొత్త రికార్డులు సృష్టిస్తోంది.

ప్రధానమంత్రి నాయకత్వంలో ప్రపంచ వేదికపై భారతదేశ స్థానం అపూర్వంగా బలోపేతమైంది. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారతదేశ స్వరం మరింత ప్రభావవంతంగా మారి, ప్రపంచ దేశాల మధ్య దేశ ప్రతిష్ఠ కొత్త శిఖరాలను అధిరోహించింది. భారత్ విజయవంతంగా జీ-20 అధ్యక్ష బాధ్యతలను నిర్వహించడం, గ్లోబల్ సౌత్ దేశాల ఆకాంక్షలకు ప్రపంచ వేదికపై గళం వినిపించడం, వివిధ అంతర్జాతీయ కార్యక్రమాల్లో నాయకత్వ పాత్ర పోషించడం వంటి పరిణామాలు దేశ అంతర్జాతీయ గౌరవాన్ని మరింత పెంచాయి.ప్రధానమంత్రి కృషి ఫలితంగా 170కి పైగా దేశాలు ఏకమై, ప్రతి సంవత్సరం జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించడం భారతదేశానికి లభించిన విశిష్ట గౌరవానికి నిదర్శనం.

వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధి రంగాల్లో భారత్ బాధ్యతాయుత నమూనాను ప్రపంచానికి చూపింది. అంతర్జాతీయ సౌర కూటమి, డిజాస్టర్ రెసిలియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూటమి, గ్లోబల్ బయోఫ్యూయల్ అలయన్స్ వంటి కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. మిషన్ లైఫ్, 'ఏక్ పేడ్ మా కే నామ్', 'క్యాచ్ ది రైన్', 'అమృత్ సరోవర్' వంటి ఉద్యమాలు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాయి.

భారత చరిత్రలో తొలిసారిగా అభివృద్ధి, వారసత్వ పరిరక్షణ రెండూ సమాంతరంగా ముందుకు సాగుతున్నాయి. కొత్త పార్లమెంట్ భవనం, సేవా తీర్థ్, కర్తవ్య పథ్, కర్తవ్య భవన్ వంటి నిర్మాణాలు నూతన భారత ఆత్మవిశ్వాసానికి చిహ్నాలుగా నిలిచాయి.

స్వచ్ఛ భారత్, బేటీ బచావో బేటీ పఢావో, ఎల్పీజీ సబ్సిడీ స్వచ్ఛందంగా వదులుకునే ఉద్యమం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజా భాగస్వామ్యాన్ని ప్రధానమంత్రి మార్పు సాధనంగా మలిచారు. కరోనా మహమ్మారిని దేశం విజయవంతంగా ఎదుర్కొంది.

గత 12 సంవత్సరాల రాజకీయ స్థిరత్వం అభివృద్ధి వేగానికి అపూర్వ ఊపునిచ్చిందని కేంద్ర మంత్రివర్గం పేర్కొంది. మౌలిక సదుపాయాల రంగంలో జరిగిన మార్పులు దీనికి నిదర్శనం. ఈ స్థిరత్వం ప్రపంచ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని కూడా పెంచింది.

గత 12 సంవత్సరాల్లో ప్రధానమంత్రి నాయకత్వం పరిపాలనలో చురుకుదనం, నిర్ణయాల్లో పారదర్శకత, విధానాల్లో దూరదృష్టికి ప్రతీకగా నిలిచింది. దీనివల్ల భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరించింది.

కేంద్ర మంత్రివర్గం:

1. ఈ చారిత్రాత్మక విజయంపై గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసింది.

2. పేదల సంక్షేమం, వెనుకబడిన వర్గాల సాధికారత కోసం ఆయన నాయకత్వంలో జరిగిన కృషికి కృతజ్ఞతలు తెలియజేసింది.

3. 25 కోట్లకు పైగా పేదలు పేదరికం నుండి బయటపడేలా చేసిన విధానాలను ప్రశంసిస్తుంది.

4. దేశసేవ పట్ల ఆయన అపూర్వ అంకితభావం, అలుపెరగని కృషికి కృతజ్ఞతలు తెలుపింది.

5. సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం చేసిన కృషిని అభినందించింది.

6. జాతీయ భద్రత బలోపేతం, భారత ప్రయోజనాల పరిరక్షణలో ఆయన నాయకత్వాన్ని ప్రశంసించింది.

7. వికసిత భారత్ నిర్మాణం కోసం ఆయన దూరదృష్టి, నాయకత్వానికి సంపూర్ణ మద్దతు తెలియజేసింది.

గౌరవనీయ ప్రధానమంత్రి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కోసం కేంద్ర మంత్రివర్గం శుభాభినందనలు తెలిపింది.

గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్వావలంబన, భద్రత, సుసంపన్నత, గౌరవం దిశగా మరిన్ని శిఖరాలను అధిరోహిస్తూ, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించే దిశగా ముందుకు సాగుతుందని కేంద్ర మంత్రివర్గం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.